




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 266 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 18-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## పశ్చిమ బెంగాల్‌కు చొరబాట్లు అతి పెద్ద సవాల్



- వారిని తిరిగి పంపించేయాలి
- మాల్డా సభలో ప్రధాని మోదీ

**మాల్డా**

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో టీఎంసీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దాడికి పదును పెట్టారు. ఉత్తర బెంగాల్‌లోని మాల్డా జిల్లాలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులు పెద్దఎత్తున వస్తుండటంతో రాష్ట్ర జనాభా స్వరూపంలో సమతుల్యత దెబ్బతింటున్నదన్నారు. అక్రమ చొరబాట్లు రాష్ట్రానికి అతిపెద్ద సవాల్ అని చెప్పారు. టీఎంసీ ప్రాపకం, సిండికేట్ రాజ్ కారణంగానే -మిగతా 2 లో


## గ్రీన్‌లాండ్ జోలికి రావద్దు

- ట్రంప్‌నకు వ్యతిరేకంగా డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లో భారీ నిరసనలు



**న్యూఢిల్లీ-**

గ్రీన్‌లాండ్‌ని స్వాధీనం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌వ్యాప్తంగా శనివారం భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లోని సిటీ హాలు ఎదుట వేలాదిమంది నిరసనకారులు ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్హస్, ఆల్బోర్గ్, ఓడీఎన్స్, నూక్ తదితర డచ్ నగరాలలో కూడా శనివారం భారీ నిరసన ర్యాలీలు జరిగాయి. గ్రీన్‌లాండ్‌లో కూడా శనివారం నిరసన ప్రదర్శనలు జరిగాయి.గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రకటనలు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా తాము నిరసన తెలియచేస్తున్నట్టు జాతీయ ప్రతినిధి సంఘం చైర్‌పర్సన్ కామిల్లా -మిగతా 2 లో



## నలుగురు మావోయిస్టులు మృతి

- ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోఎన్‌కౌంటర్

**కొత్తగూడెం**

మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా నార్త్‌వెస్ట్ రీజియన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్), జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), కోబ్రా బలగాల సంయుక్త ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకర పోరు జరిగినట్టు తెలిసింది.జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టగా.. ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఒక ఏకే-47, ఇతర ఆయుధ, వస్తు సామగ్రి లభించింది. మృతుల్లో ఒకరు డివిజనల్ కమిటీ సభ్యుడు, నేషనల్ పార్క్ ఏరియా దళ కమాండర్ దిలీప్ బెడ్జా, ఏరియా కమిటీ మెంబర్ కోసా మాండవిగా పోలీసులు గుర్తించారు. ఎదురుకాల్పుల ఘటనతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం ఆ ప్రాంతంలో మరిన్ని భద్రతా బలగాలను మోహరించి గాలింపు చర్యలను ముమ్మరం చేసింది.

## పాలమూరు అన్యాయం చేసిన కేసీఆర్

### పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు



- బిఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం
- పదేళ్లపాటు ప్రాజెక్టులు కట్టకుండా తీవ్ర నిర్లక్ష్యం
- రూ.1,284 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్,**

దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ దాగి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి చెమట అందులో ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. -మిగతా 2 లో



## మున్సిపల్ ఎన్నికల్లో కీలక ముందడుగు

- రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఎన్నికల సంఘానికి అందనున్న రిజర్వేషన్ల జాబితా

**హైదరాబాద్-**

: తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల -మిగతా 2 లో



## మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బిజెపి హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా

**హైదరాబాద్,**

రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ -మిగతా 2 లో

## లక్కీడ్రా లపేరుతో మోసాలు

- అలాంటి వారిని బొక్కల్లో తోస్తాం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- నగరపోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్,**

సోషల్ మీడియాలో లక్కీడ్రాల పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామంటూ ఆకర్షణీయ ప్రకటనలతో అమాయకులను మోసం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా లక్కీడ్రాల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని గుర్తించామని అన్నారు. 'కేవలం రూ.99తో కారు గెలుచుకోండి. లక్కీడ్రాలో బైక్, ప్లాట్, ఖరీదైన బహుమతులు' -మిగతా 2 లో



## రాహుల్‌గాంధీతో డీకే భేటీ

- కర్ణాటకలో నాయకత్వ మార్పుపై చర్చ!

**న్యూఢిల్లీ,**

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ న్యూఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేతో భేటీ అయ్యారు. దీంతో కర్ణాటకలో నాయకత్వ మార్పుపై సాగుతున్న ఊహాగానాలకు మరోసారి రెక్కలు వచ్చాయి. రాహుల్‌గాంధీతో ముఖాముఖీ చర్చలు జరిపిన శివకుమార్ అనంతరం ఖర్గేతో విడిగా సమావేశమైనట్లు వర్గాలు వెల్లడించాయి. చర్చల వివరాలను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా వెల్లడించలేదు.అయినప్పటికీ కర్ణాటకలో రాజకీయ పరిస్థితి, ప్రభుత్వంలో అంతర్గత సమన్వయం, నాయకత్వ మార్పుపై సాగుతున్న ఊహాగానాలపైనే ప్రధానంగా చర్చలు జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల డీకే శివకుమార్ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నాయకులు జరిపిన సమావేశాల నేపథ్యంలో జరిగిన భేటీలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. అయితే కర్ణాటక రాజకీయాలతోపాటు వివిధ రాష్ట్రాలలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సంస్థాగత చర్చలలో కూడా డీకేఎస్ పాల్గొన్నారు. -మిగతా 2 లో

## ఘనంగా తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు నిడిగొండ శ్రీరామ్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రసిద్ధ జ్యోతిష్యులు వేణుగోపాలస్వామి చేతుల మీదుగా క్యాలెండర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కండె వెంకట్, బొజ్జ నిఖిల్, దిలీప్, ప్రదీప్, సామల సాయి కిరణ్, నవీన్ కుమార్, రాకేష్, శ్రీకాంత్ రెడ్డి, కుమార్, దశరథం, సాయి, ప్రశాంత్, మణి వర్ధన్, శ్రీశైలం, యాదయ్య, ప్రసన్న తదితరులు హాజరై సంఘ కార్యకలాపాలకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు



సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా జర్నలిస్ట్స్ సంఘం చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, సంఘ నాయకులు, ప్రముఖులు హాజరై విజయవంతం చేశారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
ఆదివారం 18 జనవరి 2026

# పాలమూరు అన్యాయం చేసిన కేసీఆర్

మొదటి తరువాయి



ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్దండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారని సీఎం అన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వదభూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్కీడ్రా లపేరుతో మోసలు

మొదటి తరువాయి



అంటూ ప్రచారం చేస్తూ ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ స్కామ్‌లలో ముఖ్యంగా యువత, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు కొత్త వేషాల్లో లక్కీ డ్రా స్కామ్‌లకు తెరలేపారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల మాదిరిగానే వీటి ద్వారా కూడా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, చివరికి ఎలాంటి బహుమతులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో సీపీ సజ్జనార్ కఠినంగా స్పందించారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లయినా సరే ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. లక్కీ డ్రాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్(బ్యానింగ్) యాక్ట్1978 కింద కేసులు నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అవసరమైతే ఐటీ యాక్ట్, చీటింగ్ కేసులు, క్రిమినల్ చట్టం కింద సెక్షన్లు విధించే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజలు లక్కీ డ్రాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మకండని.. ముందుగా డబ్బులు అడిగే లక్కీ డ్రాలు మోసమేనని, కార్లు, బైకులు, ఎ÷-లాట్లు ఇస్తామంటూ చేసే ఆఫర్లను నిర్ధారించుకోకుండా నమ్మొద్దని సూచించారు. అనుమానాస్పద ఖాతాలు, పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. లక్కీ డ్రా స్కామ్‌లకు గురైన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, సైబర్ క్రైమ్ విభాగంలో అధికారిక హెల్ప్‌లైన్స్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా బంద్ కావడంతో లక్కీ డ్రా అంటూ కొత్త వేషాలతో వీళ్లు దర్శనమిస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలకు పాల్పడే సెలబ్రిటీలైనా, సోషల్‌మీడియా స్టార్లయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సజ్జనార్ హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

మొదటి తరువాయి



చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేండ్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# నాటో నుంచి అమెరికా బయటకొస్తుంది!

### గ్రీన్‌లాండ్‌పై అంగీకరించకపోతే ఇదే పరిస్థితి

**వాషింగ్టన్ :-**
నాటో నుంచి అమెరికా బయటకు వచ్చే అవకాశం ఉందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీ నం చేసుకోవడానికి నాటో మిత్ర దేశాలు మద్దతివ్వకపోతే, ఈ పరిణామ ం జరుగుతుందని బెదిరించారు. గీన్‌లాండ్‌పై నాటో తమతో చర్చలు జరుపుతున్నదని,దేశ భద్రత కోసం గ్రీన్‌లాండ్ తమకు చాలా అవసమని చెప్పారు. అది తమ ఆధీనంలో లేకపోతే, దేశ భద్రత, ముఖ్యంగా గోల్డెన్ డోమ్ విషయంలో, పెద్ద లోపం ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంలో తనకు మద్దతివ్వని దేశాలపై టారిఫ్‌లు విధిస్తానని ఇటీవల హెచ్చరించారు.



**గ్రీన్‌లాండ్‌పై మద్దతివ్వనందుకు 10% సుంకాలు: ట్రంప్**

గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించడంలో సహకరించనందుకు డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ వంటి యూరోపియన్ దేశాలపై 10 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమలులోకి వస్తుందని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌పై ఎటువంటి ఒప్పందం కుదరకపోతే ఈ ఏడాది జూన్ 1 నుంచి ఈ సుంకాలను 25 శాతానికి పెంచుతానని ఆయన హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ కోసం తాను చేస్తున్న ప్రయత్నానికి మద్దతు ఇవ్వని దేశాలపై సుంకాలు విధిస్తానని హెచ్చరించిన మరుసటి రోజే తన మిత్రులైన యూరోపియన్ దేశాలపై ట్రంప్ సుంకాల మోత మోగించారు.

## పశ్చిమ బెంగాల్‌కు
# చొరబాట్లు అతి పెద్ద సవాల్

మొదటి తరువాయి



ఈ సమస్య తీవ్రమవుతున్నదన్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి కూడా చొరబాటుదారులను పంపించేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీకి అధికారాన్ని కట్టబెడితే, అక్రమ వలసలను ఆపేందుకు గట్టి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. భారత దేశంలో శరణార్థులుగా జీవిస్తున్న మటువా వంటి తెగలవారు ఆందోళన చెందనక్కర్లేదని భరోసా ఇచ్చారు.

**తొలి వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభం**
మోదీ తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించారు. ఇది హౌరా-గువాహటి మధ్య నడుస్తుంది. నాలుగు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వర్చువల్ విధానంలో జెండా ఊపి, ప్రారంభించారు.

# గ్రీన్‌లాండ్ జోలికి రావద్దు

మొదటి తరువాయి



సీజింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. డానిష్ రాజ్యాన్ని, గ్రీన్‌లాండ్ ప్రజల స్వయం నిర్ణాయక హక్కును గౌరవించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రీన్‌లాండ్‌కు ప్రపంచ దేశాల మద్దతును కూడగడతామని ఆమె ప్రకటించారు. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు, గ్రీన్‌లాండ్‌పై ఆశపడొద్దు అన్న నినాదాలతో వేలాదిమంది నిరసనకారులు డెన్మార్క్‌వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించినట్టు రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది.

# మున్సిపల్ ఎన్నికల్లో కీలక ముందడుగు


మొదటి తరువాయి



షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3(ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటాయించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్),రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్),మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్‌ఎంసీ - మహిళ (జనరల్)
నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.

# రాహుల్‌గాంధీతో డీకే భేటీ

మొదటి తరువాయి



అదే సమయంలో కర్ణాటక ఇంధన మంత్రి కేజే జార్జి ఢిల్లీలో రాహుల్‌ను కలుసుకోవడం విశేషం

# పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం





**-- మొదటి వార్డులో విషవాయువుల రాజ్యం**
**- అధికారులపై షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తీవ్ర ఆగ్రహం**

**ఫరూక్‌నగర్,జనవరి 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్‌నగర్ పరిధిలోని ఫరూక్‌నగర్ మండల కేంద్ర శివారులో ఉన్న మొదటి వార్డు పరిస్థితి చూస్తే పాలకులు చెప్పే అభివృద్ధి మాటలు ఎంత ఖాళీగా ఉన్నాయో అర్థమవుతోంది. ఒకవైపు పురపాలిక ఎన్నికల హడావిడి, మరోవైపు 'దుర్గంధరహిత షాద్‌నగర్ణ అంటూ ప్రచారాలు సాగుతున్నా, వాస్తవంలో మాత్రం ఈ ప్రాంతం దుర్గంధం, కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. చుట్టూ పచ్చని పంటపొలాల మధ్య చనిపోయిన పశువుల కళేబరాలను బహిరంగంగా పడేయడం, వాటిని ఇష్టారాజ్యంగా కాల్చివేయడం నిత్యకృత్యంగా మారింది. దీనికి తోడు పాత ఇనుప సామాగ్రి, విద్యుత్ కేబుళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడంతో వెలువడుతున్న దట్టమైన పొగ గాలిని పూర్తిగా విషపూరితంగా మారుస్తోంది. ఈ పొగ ప్రభావంతో పంటలు దెబ్బతింటుండగా, స్థానిక ప్రజలు శ్వాసకోశ సమస్యల బారిన పడే ప్రమాదం ఏర్పడుతోంది.ఈ దారుణ పరిస్థితులను శనివారం ప్రత్యక్షంగా పరిశీలించిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాలకు అతి సమీపంలోనే ఈ తరహా కాలుష్యం కొనసాగడం అమానుషమని, ఇలాంటి దృశ్యాన్ని తాను ఎక్కడా చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు. పశువుల కళేబరాలను ఇష్టారాజ్యంగా వదిలేయడం వల్ల వాటిని కుక్కలు తిని పిచ్చివ్యాధికి గురై ప్రజలపై దాడి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ కాలుష్యం వల్ల బొబ్బిలి చెరువుతో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఇతర చెరువులు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. గాలి పీల్చుకునే పరిస్థితి కూడా లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, ఈ సమస్య కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పరిష్కరించాల్సిన అంశమని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ కేబుళ్లు ఎలా ఇక్కడికి చేరుతున్నాయన్న అంశంపై విద్యుత్ శాఖ కూడా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పటికే మున్సిపాలిటీ కార్యాలయానికి, పోలీస్ శాఖకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఒకటవ వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే మున్సిపల్ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి పర్యావరణ పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది.

# దామరచర్లలో గ్రామపంచాయతీ వర్కర్ల ధర్నా



**దామరచర్ల, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దామరచర్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ధర్నా జరిగింది.సిఐటియు మండల కన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గ్రామపంచాయతీ సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని, వారికి పెండింగ్ వేతనాలు చెల్లించి, డ్రెస్ కోడ్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్కర్లు మురికిగుంటల్లో చేతులు పెట్టి ఎన్నో ఇబ్బందులు పడుతున్నా కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.కొత్తగా ఎన్నికైన సర్పంచులు వర్కర్ల పట్ల దయ చూపి, కనీస వేతనం, ఆరోగ్య భీమా, అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దామరచర్ల మండల గ్రామపంచాయతీ వర్కర్స్ సిఐటియు అనుబంధం అధ్యక్షులు శ్రీరాములు వాడపల్లి, ఉపాధ్యక్షులు అక్కెనపల్లి సైదులు, ప్రధాన కార్యదర్శి ఎండి జైరు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకోల్ కేకే బస్తీలో సిసి రోడ్ల ప్రారంభం



**మహేశ్వరం, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన అమ్మేటే గ్రామం కె.కే. బస్తీలో సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మరియు మాజీ సర్పంచ్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి.ఈ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారం అందించారని, గ్రామాభివృద్ధి దిశగా ఇది కీలక అడుగుగా నిలుస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పులిమామిడి జనార్దన్ గౌడ్, వార్డు సభ్యులు తిరుమలి యాదయ్య, ఎర్ర భాను ప్రసాద్, బొజ్జం మల్లేష్ యాదవ్, బొజ్జం శ్రీనివాస్, గుడెపు కుమార్, బొజ్జం శివకుమార్, కొండని శేఖర్ పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు ఆరడి వెంకటేష్ యాదవ్, గాదె శౌరెడ్డి, పల్లెర్ల ఆరోగ్య రెడ్డి, గాదె లూర్దు రెడ్డి, పల్లెర్ల రాజప రెడ్డి, తుమ్మ ప్రశాంత్ రెడ్డి, తుమ్మ ఇన్న రెడ్డి, గాదె వినోద్ రెడ్డి, గాదె బాల్ రెడ్డి, పల్లెర్ల చిన్నపు రెడ్డి, బక్కని అశోక్, జగన్, కృష్ణ, శంకరయ్య, మహేష్ తదితరులు హాజరయ్యారు.

# ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

**-ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్ .**



**దేవరకొండ జనవరి 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.శనివారం చింతపల్లి మండలం,తీదేడుగ్రామం డంపింగ్ యార్డు వద్ద ఉన్న చెత్తను జె.సి.బితో తొలగించారు.అనంతరం మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధి కోసం కృషి కృషి చేస్తామని తెలిపారు.తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సాయ శక్తుల కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య,రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్,మర్ల యాదగిరి యాదవ్,శివర్ల పర్వతాలుఅబశ్రీశ్రీ యాదవ్,సందె లక్ష్మయ్య,బిఆర్ఎస్ నాయకులు మద్రు రామారావు,వీరమల్ల వెంకటయ్య,గంటెల బాబు,సందె యేసు,సందె శంకర్,పంబాల చెన్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలకు దరఖాస్తు చేసుకోవాలి

**-ఎంపీడీవో కుసుమ మాధురి**



**ఆమనగల్లు, జనవరి 17(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలకు ఈ నెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. శనివారం ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అండర్-14 విభాగంలో కబడ్డీ,ఖోఖో,వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండు, ఎంపీఓ లక్ష్మణ్, పిఈటీలు పాల్గొన్నారు.


# లాటరీ పద్ధతి ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు మరియు కరీంనగర్ కార్పొరేషన్‌లో మహిళా రిజర్వేషన్ వార్డులను లాటరీ పద్ధతి ద్వారా ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా రిజర్వేషన్ కేటాయింపు పూర్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ వార్డులలో మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు లాటరీ పద్ధతిలో నిర్వహించామని తెలిపారు.చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలతో పాటు కరీంనగర్ కార్పొరేషన్‌లో వార్డుల వారీగా రిజర్వేషన్ వివరాలను ప్రకటించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపోల్ దేశాయ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# క్లోమ వ్యాధి బాధ భరించలేక యువకుడి ఆత్మహత్య



**కరీంనగర్ ,రూరల్ జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తీగలగుట్టపల్లి గ్రామానికి చెందిన రోడ్డ వంశీ (29) కడుపు నొప్పితో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు సంవత్సరాలుగా క్లోమ వ్యాధితో బాధపడుతున్న వంశీ, చికిత్సలు చేయించుకున్నప్పటికీ ఉపశమనం లేకపోవడంతో నిన్న సాయంత్రం తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.తలుపులు తెరవకపోవడంతో కుటుంబ సభ్యులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూసే సరికి వంశీ ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గమనిక:**మీరు లేదా మీకు తెలిసిన ఎవరైనా తీవ్రమైన ఒత్తిడి, నిరాశ లేదా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్నట్లయితే, వెంటనే నమ్మకమైన కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించడం అత్యంత అవసరం. ప్రొఫెషనల్ సహాయం తీసుకోవడం ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. మీరు ఒంటరిగా లేరు, సహాయం అందుబాటులో ఉంది.

# కాలుష్య కోరల్లో నాగులపల్లి గ్రామం



**షాద్‌నగర్, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగులపల్లి గ్రామం కాలుష్య కరాళాల్లో మునిగిపోతోంది. జనంపేట (ఫరూక్‌నగర్) ప్రాంతం నుండి వచ్చే డ్రైనేజీ నీరు నాగులపల్లి వద్ద చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పాడి పశువులు మంచినీటి బదులు మురుగునీరు తాగి మృత్యువాత పడుతున్నాయి.గ్రామ ప్రజలు రహదారి వెంట ప్రయాణించే సమయంలో మురుగునీటి వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న శివాలయంలో పూజలకు వచ్చే భక్తులు ఆలయ ఆవరణంలో చెత్త, మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం కారణంగా ప్రజలు తరచూ రోగాల బారిన పడుతున్నారని, మూగజీవాలు మురుగునీరు తాగి మృత్యువాత పడుతున్నాయని వారు వాపోయారు. దీని వల్ల పాడి రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు






**కందుకూర్, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రంలో కొత్తగూడ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఏసీపీ ఏ. చంద్రశేఖర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, శిక్షలు, చట్టపరమైన చర్యలపై స్పష్టంగా వివరించారు. మద్యం మత్తులో వాహనం నడిపితే జరిమానాలు, జైలు శిక్షలు, సామాజిక సేవ విధించే అవకాశాలు ఉన్నాయని ఆయన హెచ్చరించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం ఎంత ముఖ్యమో ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం, తప్పు దారిలో ప్రయాణించడం, ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేయడం, అధిక వేగంతో వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటి చర్యల వల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కావడం, జైలు శిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, కుల్పబుల్ హోమిసైడ్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ చంద్రశేఖర్ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపిన ప్రభుత్వ ఉద్యోగులు కోర్టు శిక్ష పడిన సందర్భంలో విధుల నుండి సస్పెండ్ చేయబడతారని స్పష్టం చేశారు. అదేవిధంగా సురక్షితంగా రోడ్డు దాటడం, లేన్ క్రమశిక్షణ పాటించడం వంటి అంశాలపై విజువల్ ఎయిడ్స్, పోస్టర్లు, ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా ప్రజలకు సందేశం చేరవేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడుకోవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ పిఎస్ ఎస్‌హెచ్ఓ సీతారాం, ట్రాఫిక్ ఎస్ఐ పాండు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా బాజిరెడ్డి గూడెం సమీపంలో రోడ్డు ప్రమాద ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం సమీపంలో కారు బోల్తా పడి కస్తూర్బా గాంధీ ఏఎస్ఓ కల్పన,రావులపల్లి జిహెచ్ఎం గీత మృతి చెందడం,పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారు తుంగతుర్తి మండలం తుంగతుర్తి జిహెచ్ఎం ప్రవీణ్, రావులపల్లి జిహెచ్ఎం గీత,అన్నారం జిహెచ్ఎం సునీతరాణి, కస్తూర్బా గాంధీ ఏఎస్ఓ కల్పన...అని ప్రాథమిక వివరాలు మంత్రి దృష్టికి వచ్చాయి. వెంటనే వైద్య అధికారులు,పోలీసు యంత్రాంగాన్ని మంత్రి అలెర్ట్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మైలారం మల్లికార్జున స్వామిని దర్శించిన రసమయి బాలకిషన్



**గన్నేరువరం, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గన్నేరువరం మండలంలోని మైలారం శ్రీ భ్రమరంభ సమేత స్వయంభూ మల్లికార్జున స్వామిని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వరాల పరుశు రాములు, ఆలయ ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయి శర్మ ఆశీర్వచనం చేశారు. రసమయి బాలకిషన్‌తో పాటు మాజీ సుడా చైర్మన్ జివి రామకృష్ణారావు, సిరిసిల్ల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సిద్ధం వేణు, బిఆర్ఎస్ మండల ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- ఆమనగల్లులో మారిన రాజకీయ సమీకరణాలు
-కమిషన్ నివేదిక ప్రకారం వార్డుల కేటాయింపు

**ఆమనగల్లు, జనవరి 17(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** జిల్లాలోని ఏడు మున్సి పాలిటీ పార్టీలకు సంబంధించి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా రిజర్వేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. బీసీ కమిషన్ నివేదికను అనుసరించి, జిల్లా ఎన్నికల అధికారి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం కోటాను అమలు చేస్తూ, నిర్వహించిన డ్రా ప్రక్రియ రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

**ఆందోళనలో అభ్యర్థులు**

మున్సిపల్ చైర్మన్ పీఠంతోపాటు, వార్డుల వారీగా వెలువడిన రిజర్వేషన్లు పలువురు ఆశావహులకు షాక్ కు గురిచేశాయి. బీసీ రిజర్వేషన్ వస్తుందని ఆశించిన చోట జనరల్ కేటాయించడం, జనరల్ వస్తుందని భావించిన వార్డులు మహిళలకు రిజర్వు చేయడంతో గెలుపు గుర్రాలుగా భావించిన నేతలు నిరాశకు గురయ్యారు. ఈ మార్పులతో ఆయా మున్సిపాలిటీలో ఒక్కసారిగా రాజకీయ సందడి పెరగడమే కాకుండా, కొత్త అభ్యర్థుల వేట కూడా మొదలైంది.

**15 వార్డుల వివరాలు**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల రిజర్వేషన్ ఖరారు కావడంతో క్షేత్ర స్థాయిలో అభ్యర్థులు తమ బలబలాలను అంచనా వేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మిగిలిన ఆరు మున్సిపాలిటీల్లో కూడా ఇదే తరహా ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పదవుల కేటాయింపు పై స్పష్టత రావడంతో ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి.




రిజర్వేషన్లు ఖరారైనా వార్డులు
ఆమనగల్లు చైర్మన్ జనరల్..

**వార్డు నెంబర్.. ఖరారైన రిజర్వేషన్**

1. చంద్రాయన్ పల్లి తండా – (జనరల్ మహిళ
2. ముర్తుజా పల్లి ( ఎస్సీ మహిళ)
3. నుచ్చుగుట్ట ( జనరల్ మహిళ)
4. జంగారెడ్డి పల్లి ( జనరల్)
5. ఎస్సీ కాలనీ( జనరల్)
6. గుర్రం గుట్ట కాలనీ ( ఎస్టీ)
7. వెంకటేశ్వర కాలనీ( ఎస్టీ)
8. బీసీ కాలనీ( ఎస్సీ జనరల్ )
9. విద్యానగర్ కాలనీ( జనరల్)
10. విఠాయిపల్లి తండా ( జనరల్ మహిళ )
11. ఆదర్శనగర్ కాలనీ ( ఎస్టీ మహిళ )
12. శాంతినగర్ కాలనీ (బీసీ మహిళ )
13. శ్రీనివాస కాలనీ( ఎస్టీ మహిళ )
14. అంబేద్కర్ కాలనీ( జనరల్)
15. ఉదయ నగర్ కాలనీ ( జనరల్ మహిళ)

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ




**తిమ్మాపూర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామంలోని శ్రీ గంగమ్మ--కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఎస్డీఎఫ్ నిధుల కింద రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయ ప్రహరీ గోడను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామ ప్రజలు కూడా ఆలయ అభివృద్ధికి భాగస్వాములు కావాలని కోరారు. గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోదుమ వెంకన్న, ధర్మకర్తలు పాశం బాలయ్య, వెంకర్ల నగేష్, జి. కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ ఎంపీపీ శ్రీగిరి రంగారావు, జిల్లా కార్యాలయ ఇంచార్జీ గోపు మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, కంది అశోక్ రెడ్డి, కాలువ మల్లేశం, కాత కొమురయ్య, చిందం కిష్టయ్య, దాసరి నాగేందర్, ముంజ శ్రీకాంత్, పాశం కిరణ్, ఐతం మహేశ్, నర్సింగాపూర్ సర్పంచ్ పెరుక రవీందర్, మహాత్మానగర్ సర్పంచ్ సంపత్, ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ,జనవరి 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం రోజు నల్లగొండ పట్టణం 34 వ డివిజన్ వీటి కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34 వ వార్డు టెంపుల్ వద్ద సుమారు రూ. లి2 కోట్లలి వ్యయంతో చేపట్టనున్న మంచి నీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి గారు మాట్లాడుతూ
ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, పట్టణ పరిధిలో ప్రతి ఇంటికి నిరంతర నీటి సరఫరా లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులన్నింటినీ దశలవారీగా మెరుగుపరుస్తామని తెలిపారు.
ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని




ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న ఈ నీటి సరఫరా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి,స్థానికుల దైనందిన జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని భరోసా ఇచ్చారు. చింతల్ పార్కులో 2 కోట్ల 25 లక్షల వేయంతో అభివృద్ధి చేనున్న చింతల్ రామ్ నగర్ మామిల్లగూడ రాజు పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 1.5 కోట్ల వ్యయంతో ఎన్జీ కాలేజీ నుండి రామగిరి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు నల్లగొండను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఎస్ ఇ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుబంధు నిధులు విడుదల చేయాలి



**నిడమనూరు,,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నిడమనూరు మండల కేంద్రం లో నిర్వహించిన వంటి పత్రిక సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాటి సత్యపాల్ రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని చేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంది అని ఒకవైపు వరి నాట్లు వేసినప్పటికీ రైతుబంధు డబ్బులు పడక యూరియా దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా గెలిచినటువంటి నాయకులు రైతుల గోస పట్టించుకోవడం లేదు అని ఇప్పటికైనా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయించాలని అన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



**ఎలిగేడు, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎలిగేడు ఎస్సై మధుకర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని, గెలుపు--ఓటములు సహజమని, క్రీడాకారులు సోదరభావంతో ముందుకు సాగాలని సూచించారు.క్రీడలు శారీరక దృఢత్వానికి తోడ్పడటమే కాకుండా యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, ఆర్గనైజర్ కవంపల్లి సాయి ప్రశాంత్, రాజు, ప్రదీప్ సహా పలువురు యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

# సుస్థిర ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి




**ఎలిగేడు, జనవరి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశ రాజధానిలో నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కోడూరి విప్లవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సుస్థిరమైన హరిత వికసిత్ భారత్ పై ప్రసంగిస్తూ, 2047 నాటికి భారతదేశాన్ని స్వావలంబనతో కూడిన సంపన్న ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు, యువత చైతన్యవంతమైన శక్తిగా మారాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ, సామాజిక సాధికారత, సాంకేతిక పురోగతి, విద్యా సంస్కరణలు, ఆరోగ్య సంరక్షణ మెరుగుదల వంటి అంశాలను సమ్మేళనం చేసే సమాజ నిర్మాణం అవసరమని ఆమె పేర్కొన్నారు. సౌరశక్తి, పవనశక్తి, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడంతో పాటు చెట్లను నాటడం, నదులను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తరఫున కోడూరి విప్లవ పాల్గొని ప్రసంగించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# క్రీడలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**ఎలిగేడు, జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువకులకు క్రీడలు ప్రోత్సహిస్తున్నారని పలువురు అధికారులు సర్పంచులు అన్నారు. శనివారం ఎలిగేడు మండల కేంద్రంలో జిల్లా యువజన మరియు, క్రీడా శాఖ పెద్దపల్లి ఆధ్వర్యంలో సీఎం కప్ రెండవ ఎడిషన్ యొక్క టార్చ్ ర్యాలీ తో స్వాగతం పలికి అనంతరం వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక రకాలుగా ప్రోత్సహిస్తుందని క్రీడల పట్ల అందరికీ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ రాలి నిర్వహిస్తున్నట్లు వారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకటరెడ్డి, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, రంగు లత శ్రీనివాస్ గౌడ్, తహసిల్దార్ యాకయ్య, ఎంపీడీవో భాస్కర్ రావు, డి. వై.ఎస్. ఓ సురేష్ ప్రధానోపాధ్యాయులు, దేవేందర్ రావు, కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు పి .ఈ .టి ప్రణయ్, శ్రీకాంత్ కుమార్, వాడు సభ్యులు యువకులు పాల్గొన్నారు.

### సీఎం కప్ క్రీడలకు దరఖాస్తు చేసుకోవాలన్న ఆమనగల్ ఎంపీడీవో...

**ఆమనగల్, జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం క్రీడా పోటీలకు ఈనెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్ ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. శనివారం ఆమనగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు అండర్ 14 విభాగంలో కబడ్డీ , కో కో , వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంబంధిత అధికారులు ఎంఈఓ పాండు , ఎంపీ ఓ లక్ష్మణ్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

# పుర"పోరు మొదలుకానుంది ఇక







ప్రస్తుతం తెలంగాణరాష్ట్రంలోని మున్సిపాలిటీ,కార్పొరేషన్ లలో ఎన్నికల నగారా మోగనుంది.ఫిబ్రవరిలోనే పూర్తిచేయాలనే నేపథ్యంలో భాగంగా ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ 2011 జనాభాలెక్కలను ప్రాతిపదికగా తీసుకోని కులాలవారీగా నివేదికను సమర్పించడం జరిగింది.రిజర్వేషన్ ఆధారంగా మొత్తం 121 మున్సిపాలిటీలోని 2704 వార్డులకు రిజర్వేషన్ ఆధారంగా 121 మున్సిపల్ చైర్మన్ స్థానాలకు షెడ్యూల్డ్ తెగలకు 5,షెడ్యూల్డ్ కులాలకు 17,బీసీలకు 38,జనరల్ మహిళలకు 31,అన్ రిజర్వ్‌డ్ జనరల్ కు 30 స్థానాలనకు రిజర్వేషన్ కేటాయించగా 10 కార్పొరేషన్ లలోని 840 వార్డులకు రిజర్వేషన్ ఆధారంగా మేయర్ స్థానాలలో 4 మహిళలకు కేటాయిస్తూ,షెడ్యూల్డ్ తెగలకు 1,షెడ్యూల్డ్ కులాలకు 1,బీసీలకు 3,జనరల్ మహిళలకు 4,అన్ రిజర్వ్‌డ్ జనరల్ కు 1 స్థానాలను కేటాయించడం జరిగింది. వార్డులలో షెడ్యూల్డ్ తెగలకు 27,షెడ్యూల్డ్ కులాలకు 97,బీసీలకు 296,జనరల్ మహిళలకు 220,అన్ రిజర్వ్‌డ్ జనరల్ కు 200 స్థానాలను కేటాయించడం జరిగింది. అత్యధికంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో 300 వార్డులుండగా వరంగల్, కరీంనగర్ లో 66 వార్డులు,భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం,నిజాంబాద్,పెద్దపల్లి,మంచిర్యాల,మహబ రాబ్ నగర్ లలో 60 వార్డులు,అత్యల్పంగా నల్గొండలో 48 వార్డులుండడం గమనార్హం. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధంచేసిన ఎన్నికల కమిషన్ 52లక్షల 43వేల ఓటర్లలో 25.62 లక్షలు పురుషులు,25.80లక్షల మహిళలు మరియు ఇతరులు 640 మంది ఉండగా అందులో మహిళలే అధికంగా ఉండటం గమనార్హం.ఈ పుర ఎన్నికలలో బ్యాలెట్ పేపర్లు ముద్రిస్తూ,అందులో నచ్చని అభ్యర్థులుంటే నోటానుపయోగించుకునేలా ఆ గుర్తును ముద్రించనున్నారు.అలాగే ఈ ఎన్నికలలో పార్టీల గుర్తులుండటం మూలంగా ప్రజలు ఏపార్టీకి ఎంత మద్దతునిస్తున్నారో తెలియబోతుండడం విశేషం.ఇదిలా ఉంటే నోటిఫికేషన్ రాకముందే సీటును ఆశించే అభ్యర్థులు పార్టీనాయకత్వంతో పైరవీలు కొనసాగిస్తూ ఓటర్లమద్దతు కూడబెట్టడానికి అంతర్గతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. దేశంలో 74వ రాజ్యాంగసవరణ చట్టం ప్రకారం పట్టణ స్థానికసంస్థలు ఏర్పాటై స్థానిక స్వపరిపాలన కొనసాగుతుంది.జనాభా మరియు అభివృద్ధి ఆధారంగా పట్టణసంస్థలలో 40000 లోపు జనాభానునగర పంచాయతీగా,10 లక్షలలోపు జనాభా కలిగివుంటే మున్సిపాలిటీ లేదా పురపాలక సంఘంగా,ఆపై జనాభా ఉన్న ప్రాంతాలను నగరపాలక సంస్థలుగా విభజించుకొని పరిపాలన సౌలభ్యం కోసం పాలనగావించడం జరుగుతుంది.మున్సిపల్ కార్పొరేషన్ చేత నిర్వహించబడే ప్రాంతాన్ని మున్సిపల్ ఏరియా అంటారు.ప్రతి మున్సిపల్ ప్రాంతాన్ని వార్డులుగా పిలువబడే ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించబడుతుంది.మున్సిపల్ కార్పొరేషన్ అనేది వార్డుల కమిటీతో ఏర్పడి,ఐదేళ్లకాలానికి వయోజన ఫ్రాంచైజీ ఆధారంగా కార్పొరేటర్లను వార్డులకమిటీకి ఎన్నుకోవడం జరుగుతుంది.మున్సిపల్ కార్పోరేషన్ ప్రాంతంలోని వార్డులసంఖ్య అనేది ఆ నగరజనాభా ప్రకారం నిర్ణయించబడుతుంది.ఇందులో కొన్నిసీట్లు షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగలు,వెనుకబడిన తరగతుల చెందినవారికి అలాగే మహిళలకు ప్రత్యేకంగా కేటాయించబడతాయి. మున్సిపాలిటీలో పాలన రెండువర్గాలుగా విభజించబడి ఉంటుంది

ప్రజా ప్రతినిధులు: ప్రజలు నేరుగా ఓటువేసి వార్డుసభ్యులను (కౌన్సిలర్లు/కార్పొరేటర్లు) ఎన్నుకుంటారు.వీరిలో ఒకరు చైర్మన్ (మునిసిపాలిటీ) లేదా మేయర్ (కార్పొరేషన్) గా ఎంపికవుతారు.

**అధికారులు:** ప్రభుత్వం తరపున మున్సిపల్ కమిషనర్ కార్యనిర్వాహక అధికారిగా ఉంటారు.వీరు కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలను అమలుచేయడం జరుగుతుంది.

నగర మేయర్ మునిసిపల్ కార్పోరేషన్ కు అధిపతిగా కొనసాగుతూ,మునిసిపల్ కార్పొరేషన్ల కార్యనిర్వాహక అధికారాలను కలిగివుండి,కౌన్సిలర్ల సమన్వయంతో కార్పొరేషన్ ప్రణాళిక,అభివృద్ధికి సంబంధించిన అన్నిరకాల కార్యక్రమాలను నిర్దేశించడం జరుగుతుంది.వీటి అమలును ఎగ్జిక్యూటివ్ అధికారులు (కమీషనర్లు) పర్యవేక్షిస్తారు.

రాజ్యాంగంలోని పన్నెండవ షెడ్యూల్ లో మునిసిపల్ కార్పొరేషన్లు బాధ్యతవహించే విధులు,కార్యనిర్వహణ,పథకాల అమలు,ఆదాయ వనరులకు సంబంధించిన విషయాలు జాబితాచేయబడి ఉన్నాయి.

**విధులు :**

మున్సిపాలిటీలు ప్రజలకవసరమైన కనీస సదుపాయాలను కల్పించడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది.

**నీటి సరఫరా:** త్రాగునీటి సరఫరా మరియు పైపులైన్ల నిర్వహణ.దేశీయ,పారిశ్రామిక,వాణిజ్య ప్రయోజనాల కోసం నీటి సరఫరా.

**పారిశుధ్యం:** మురుగునీటి పారుదల మరియు చెత్త సేకరణ,నవీకరణ పద్ధతులను అవలంభించడం.

**వీధి దీపాలు:** వీధుల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు మరియు నిర్వహణతో పాటు పార్కింగ్ స్థలాలు,బస్ స్టాపు లాంటి ప్రజా సౌకర్యాలను కల్పించడం.

**రోడ్లు:** పట్టణపరిధిలోని రహదారుల నిర్మాణం మరియు మరమ్మతులు.

జనన మరణాల నమోదు: జనన,మరణ ధృవీకరణ పత్రాలజారీ.

మురికివాడల అభివృద్ధి: వెనుకబడిన ప్రాంతాల ఆధునీకరణ.

నగరంలో ప్రజారోగ్యం మరియు పారిశుధ్యం మరియు పరిశుభ్రత,మశూచి,పోలియో,కలరా,క్షయ మరియు డిఫ్తీరియా వంటి వ్యాధులకు టీకా శిబిరాలు, పాఠశాలలు,లైబ్రరీలు మరియు నగరంలోని మ్యూజియంల నిర్వహణ.

**ఆర్థిక,సామాజికాభివృద్ధికి ప్రణాళిక:**

పట్టణ ప్రణాళికతో సహాపట్టణ ప్రణాళిక ఏర్పాటుచేయడం.భూ వినియోగం,భవనాల నిర్మాణ నియంత్రణతో పాటు పట్టణ అటవీ,పర్యావరణ పరిరక్షణ అంశాలను ప్రోత్సహించడం.వికలాంగులు,మానసిక వికలాంగులతో సహా సమాజంలోని బలహీన వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడం.పట్టణ పేదరిక నిర్మూలనకు పాటుపడుతూ పార్కులు,తోటలు,ఆటస్థలాలు వంటి సౌకర్యాలు కల్పించడం.సాంస్కృతిక,విద్యా,సౌందర్య అంశాలపై ప్రచారం కొనసాగిస్తూ జంతువులపై క్రూరత్వాన్ని నివారించడం లాంటి కార్యక్రమాలకు పూనుకోవాల్సి ఉంటుంది.

**ఆదాయ వనరులు:**

**పన్నులు:** ఇంటి పన్ను,ఆస్తిపన్ను మరియు నీటిపన్ను,మార్కెట్లు,వాహనాలపై పన్నులు (వాణిజ్యపరంగా మాత్రమే) వంటివి.

**ఫీజులు:** లైసెన్స్ ఫీజులు మరియు భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయం.

**ప్రభుత్వ గ్రాంట్లు:** రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలిచ్చే నిధులు ఆదాయవనరులుగా ఉన్నాయి. పట్టణాలలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షించే నిస్వార్థపరుడిని,ప్రజల క్షేమం,సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం.ఎలాంటి కక్ష్యలు,కుట్రలు లేకుండా,ఎన్నికల అధికారులతో సహకరిస్తూ,ఈ మున్సిపాలిటీ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన భాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది.కావున ఆ దిశగా పయనించాలని ఆశిద్దాం.

## వ్యాస కర్త

డా.పోలం సైదులు,
డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ,
9441930361.



# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం

### - పుష్పగుచ్ఛంతో స్వాగతించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు

**ఖమ్మం,జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు శనివారం ఖమ్మం వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డికి టియుడబ్ల్యూ జే (ఐజేయు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు, పలువురు జర్నలిస్టులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా సిపిఐ కార్యాలయం గిరి ప్రసాద్ భవన్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఈ



కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్,సామినేని మురారి,జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా నాయకులు వనం వెంకటేశ్వర్లు, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి,జిల్లా కోశాధికారి నాగండ్ల శివ,జిల్లా నాయకులు తాళ్లూరి మురళీకృష్ణ,ఏగినాటి మాధవరావు,ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ, ఈనాడు వెంకటేశ్వర్లు, చెరుకూరి గోపాలరావు, రాఘవరావు, రామారావు, రాము, వేదగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్, విబి రామ్ జీ చట్టం, మరియు జాతీయ విత్తన ,విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి

-మోడీ ప్రభుత్వ విధానాలపై జనవరి 19న నలగొండ కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి



**నల్లగొండ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లేబర్ కోడ్స్, విబి రామ్ జీ చట్టం, మరియు జాతీయ విత్తన ,విద్యుత్ సవరణ బిల్లు రద్దు చెయ్యాలని , కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం బిక్షం సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ ప్రజలకు పిలుపునిచ్చారు శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో జనవరి 19న నల్లగొండ కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని విమర్శించారు.29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఈ చట్టాలు అమలు అయితే కార్మిక వర్గం నిరాయిదులుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చినటువంటి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో విబిజి రాంజీ పేరుతో పేరు మార్చి కొత్త చట్టం తెచ్చి ఉపాధి కూలీల పొట్టలు కొట్టే చర్యలకు పూనుకుందని అన్నారు. నూతన విద్యుత్ సవరణ చట్టం 2025 ను తేవడం ద్వారా భవిష్యత్తులో రైతాంగానికి, పేదలకు ఇస్తున్నటువంటి ఉచిత కరెంటును రద్దు చేసే కుట్ర చేస్తుందని అన్నారు. మోడీ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో నూతన ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విద్వేషాలు నింపుతూ నిరంకుశ పాలన కొనసాగిస్తుందని అన్నారు. ఈ విధానాలపై రైతు వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 19న నల్లగొండలో భారీ సభ ఉంది అని ఈ కార్యక్రమాల జయప్రదానికి రైతాంగం కార్మిక వర్గం ప్రజలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆకటి లింగయ్య ,కంచర్ల జానయ్య, చంద్రయ్య ,అంజయ్య ,కల్పన, జానమ్మ ,పరమేష్ ,వెంకన్న ,సైదులు ,నాగరాజు ,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాటవు నీవే-బావుట నీవే

బాటవు నీవయో.....!
బడికి బాటవు నీవయా
బడిపిల్లల చదువులకు
బహుళ ఆసర నీవయా

విద్యార్థుల నడకల్లో
చిన్నారుల మురిపెంలో
పూసిన వెన్నెల నీవయో
చందమామవు నీవయా

బహు దాతవు నీవయో
విద్యా దాతవు నీవయా
ఈ చరికొండ గ్రామానికి
యువ నేతవు నీవయా

బాటసారుల పాదాలకు
మూగజీవుల నడకలకు
చక్కని బాటవు నీవయో
నిత్యపు దారివి నీవయా

పల్లెల దారులు నీవయో
భక్తుల బాటవు నీవయా
శ్రీ వేణుగోపాల స్వామివి
శుభ ఆశీస్సులు నీకయా

పేదల పెన్నిధి నీవయో...!
స్నేహానికి సన్నిధి నీవయా
కుల మతము లేదయో..!
అందరి బంధువు నీవయా

నీకు తిరుగు లేదయో....!
యువత అండాదండలు
సాగే రథము నీదయో....!
ప్రగతి పథము నీదయా..!

యెగిరే బావుట నీవయో
బ్రతుకు బాటవు నీవయా
ప్రతిభకు బాటవు నీవయో
యువతకు భవిత నీవయా

గ్రామ ప్రథమ పౌరుడవు
భారతీయ పౌరుడవు..!
అమ్మానాన్నల దీవెనలు
గౌరమ్మ తల్లి దీవెనలు..!
చరికొండ జనుల దీవెనలు
(శ్రీ.అద్దాల మహేందర్ యువ ప్రస్థానం)

డా"జోగు కృష్ణయ్య
రంగారెడ్డి జిల్లా



# దూళికట్ట గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత వంశీ టీమ్ .





విన్నర్ కప్ నగదు బహుమతి అందిస్తున్న గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య యాదవ్..

**ఎలిగేడు, జనవరి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండలంలోని ధూళికట్ట గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బిరియాని సెంటర్ నిర్వహణలో గ్రామస్థాయి టీ10 టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది . ఇందులో గ్రామంలోని క్రీడాకారులందరూ ఏడు జట్లుగా విడిపోయి పోటీ పడడం జరిగింది.. ఇందులో వంశీ కెప్టెన్ గా ఉన్న జట్టు విన్నర్ టీం గా నిలిచింది.. టోర్నమెంట్ బెస్ట్ బౌలర్ గా శివరాం. బెస్ట్ బ్యాట్స్మెన్ గా ఓదెల యాదవ్.. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా సందనవేణి నరేష్ యాదవ్ నిలిచారు విన్నర్ టీంకు గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య చేతుల మీదుగా ట్రోపి ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా సర్పంచ్ కొమురయ్య మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని.. క్రీడలు మానసిక ఆనందాన్ని ఇస్తాయని అలాగే స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని గ్రామంలోని క్రీడాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు... గెలుపొందిన టీంకు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బిర్యాని సెంటర్ ప్రొప్రైటర్ భూసారపు తిలక్ గౌడ్ 5016? రూపాయల ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగింది... ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య.. వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ సీనియర్ క్రీడాకారులు మెరుగు రాజు గౌడ్ గీస మహేందర్ ఆర్గనైజర్స్ రంగు శ్యామ్ గౌడ్. ఆవుల మనోజ్ యాదవ్.. ఇరుగు రాళ్ల వంశీ మరియు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యం

## వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా పట్టం కట్టాలని, తద్వారా కరీంనగర్ పట్టణాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు అన్నారు.కొత్తపెల్లిలోని ప్రజాభవన్‌లో శనివారం సాయంత్రం వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేకుర్తి నాయకుడు అస్తపురం మారుతి ఆధ్వర్యంలో 200 మంది, 12వ డివిజన్‌కు చెందిన తెల్ల రమేష్ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్‌లో చేరగా, రాజేందర్ రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకుల వల్ల కరీంనగర్ అన్ని రంగాల్లో భ్రష్టు పట్టిందని, అవినీతిలో గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారని మండిపడ్డారు. అభివృద్ధి అంటే ఎలా ఉండాలో కాంగ్రెస్ చేసి చూపిస్తుందని స్పష్టం చేశారు.కరీంనగర్ అభివృద్ధిలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే జగపతిరావు రోల్ మోడల్‌గా నిలిచారని, ఆయన కృషివల్లే నియోజకవర్గంలో ప్రతి అభివృద్ధి పని జరిగిందని గుర్తుచేశారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 ఎమ్మెల్యేల్లో ఎవ్వరూ జగపతిరావు లాగా అభివృద్ధి చేయలేదని గర్వంగా పేర్కొన్నారు. బిజెపి--బిఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నాయని, ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇరుపార్టీలకు గట్టి బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రోజురోజుకు కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకోవడంతో వెలిచాల ప్రజాభవన్ కళకళలాడుతోంది.

# విజయవంతంగా ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



**హుస్నాబాద్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. గ్రామస్థాయి క్రీడా అభివృద్ధి లక్ష్యంగా జరిగిన ఈ పోటీల్లో 11 జట్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శించాయి.సీనియర్ విభాగంలో గేమ్ చెంజర్స్ కాశవాడ జట్టు విజేతగా నిలిచి ఐదు వేల రూపాయల నగదు, జ్ఞాపికలు అందుకుంది. ఆల్ రౌండర్స్ స్టూడెంట్స్ జట్టు రెండో స్థానంలో నిలిచి రెండు వేల రూపాయలు పొందింది. జూనియర్ విభాగంలో రాక్ స్టార్ జట్టు మొదటి బహుమతి, రేసింగ్ రాక్ స్టార్ జట్టు రెండో బహుమతి సాధించాయి. విజేతలకు గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందిస్తాయని, ఇటువంటి పోటీలు గ్రామంలో క్రీడా వాతావరణాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు. సంక్రాంతి వేళ ఉల్లంపల్లిలో క్రీడా పండుగ వాతావరణం నెలకొంది.

# సమున్నతి బీజేపీ విజయంతోనే సాధ్యం

## - మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని, గెలిచిన స్థానాలకు కేంద్రం నుండి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అవసరమైతే సీఎస్సార్ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు.కాంగ్రెస్ పాలనలో పట్టణ స్థానిక సంస్థలకు నిధులు ఖర్చు చేయలేదని విమర్శిస్తూ, దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. అభివృద్ధి, ప్రజా సమస్యలు, హిందుత్వం బీజేపీ ఎన్నికల ప్రధాన ఎజెండా అని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ మధ్య జరుగుతున్న రాజకీయ ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీ మాత్రం ప్రజల విశ్వాసాన్ని నమ్ముకుని ఎన్నికల్లోకి వెళుతోందని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఇంటికి వెళ్లి భరోసా ఇవ్వాలని, కార్యకర్తలు కష్టపడి పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఫార్మసీలో డాక్టరేట్ అందుకున్న సబ్బితం గ్రామస్థుడు



**పెద్దపల్లి, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన పులిపాక శంకరయ్య ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి సమర్పించిన ఆయన పరిశోధనాత్మక గ్రంథం డెవలప్‌మెంట్, ఆప్టిమైజేషన్, క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో ఫార్ములేషన్స్ ఆఫ్ ఆల్పీనియా మ్యూటికా అండ్ ట్రేడ్‌స్కాంటియా స్పాథేసియా యాంటీ-డయాబెటిక్ యాక్టివిటీకి గాను ఈ పురస్కారం లభించింది. యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో వైస్ ఛాన్సలర్ అశోక్ కుమార్ మిట్టల్ చేతుల మీదుగా శంకరయ్య డాక్టరేట్ అందుకున్నారు. పేద కుటుంబానికి చెందిన ఆయన పెద్దపల్లి ఇండియన్ మిషన్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ పెద్దపల్లి ప్రభుత్వ కళాశాలలో చదివి, తర్వాత హైదరాబాద్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాలలో బి.ఫార్మసీ, వరంగల్ వాగ్దేవి ఫార్మసీ కాలేజీలో ఎం.ఫార్మసీ పూర్తి చేశారు.ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. శంకరయ్యకు డాక్టరేట్ లభించడం పట్ల మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి



**హుస్నాబాద్ ,జనవరి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
108 ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ హుస్నాబాద్ క్లస్టర్‌లోని 108, 102, 1962 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల్లో ఉన్న వసతులను పరిశీలించడంతో పాటు సిబ్బంది పని తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సరైన సమయంలో ఆసుపత్రులకు తరలించి, వైద్యుల సూచన మేరకు చికిత్స అందించాలన్నారు.కార్యక్రమంలో 108 సిబ్బంది రాజిరెడ్డి, రాజు, జగన్, రాజు, 102 సిబ్బంది శ్రీధర్, వాస్ రెడ్డి, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల గ్యాస్ యోజన కింద లబ్ధిదారులకు ఉచిత సిలిండర్ల పంపిణీ



**రాజన్న సిరిసిల్ల ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ యోజన 2.0 పథకం కింద గంభీరావుపేట మండలంలో లబ్ధిదారులకు ఉచిత ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కోడె రమేశ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 625 కోట్ల రూపాయల వ్యయంతో 25 లక్షల మంది మహిళలకు ఉజ్వల గ్యాస్ పథకం ద్వారా ఉచిత సిలిండర్లు అందజేస్తున్నారని తెలిపారు. గతంలో 10.58 కోట్ల మంది అర్హులైన మహిళలకు ఉచిత ఎల్పీజీ గ్యాస్ పంపిణీ చేయడంతో పాటు వారికి రూ.300 సబ్సిడీని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ పథకాన్ని ప్రారంభించి మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని, గంభీరావుపేట మండల శాఖ తరఫున మరియు ప్రజల తరఫున ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.మహిళలు మాట్లాడుతూ ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సౌకర్యం లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ ఆడెపు రవీందర్, సర్పంచులు బండ సుకన్య, దేవయ్య, పొన్నాల మహేష్, ఉపసర్పంచ్ నవీన్ కుమార్, నాయకులు దేవేందర్ యాదవ్, దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, పత్తి స్వామి రాజు, నర్సింలు, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్, కృష్ణకాంత్ రాజు, మహేష్, దుర్గేష్, దేవేందర్ యాదవ్, బాలయ్య, రాజిరెడ్డి, దేవరాజు, రాకేష్, నారాయణ, ఎల్లం, రవీందర్, శ్రీనివాస్ చారి, చంద్రం యాదవ్, రాజు, రవీందర్ నాయక్, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో 50 శాతం మహిళలకు కేటాయింపు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా రిజర్వేషన్ వార్డులను లాటరీ పద్ధతిలో ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 124 వార్డుల్లో 50 శాతం మహిళలకు కేటాయించామని, డ్రా పద్ధతిలో పారదర్శకంగా రిజర్వేషన్ ఖరారు చేశామని పేర్కొన్నారు.పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో గత ఎన్నికల మాదిరిగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ సీట్లు రిజర్వు కాగా, రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 60కు పెరగడంతో 2011 జనాభా లెక్కలు, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా కొత్త కేటాయింపులు చేపట్టినట్లు తెలిపారు. రామగుండంలో ఎస్సీలకు 13, ఎస్టీలకు 1, బీసీలకు 16 స్థానాలు రిజర్వ్ కాగా, పెద్దపల్లిలో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 13, మంథనిలో ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, బీసీలకు 3, సుల్తానాబాద్‌లో ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, బీసీలకు 4 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా కార్మిక రైతు వ్యతిరేక చట్టాలన రద్దు చేయాలని సిఐటియు డిమాండ్




**గంగాధర ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ జెండా ఊపి ప్రచార జాతర ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టారని, 100 రోజుల పనిని 125 రోజులకు పెంచినట్లు చెప్పినా అది నోటిఫైడ్ ఏరియాలకు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. రాష్ట్రాలపై 40 శాతం నిధుల భారం మోపడం వల్ల ఉపాధి హామీ పథకం దెబ్బతింటుందని పేర్కొన్నారు.అలాగే కార్మికుల హక్కులను హరించేలా నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టారని, రైతు వ్యతిరేక చట్టాలపై దేశవ్యాప్తంగా రైతులు పోరాడి మోడీ ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించారని గుర్తుచేశారు. విద్యుత్ సంస్కరణ చట్టం 2025ను ఉపసంహరించుకోవాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం నాయకులు, స్థానిక ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు



**గంగాధర, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు “అరైవ్ అలైమ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై వంశీకృష్ణ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అధికంగా జరగడానికి ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమేనని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించడం తప్పనిసరి అని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.అధిక వేగం నియంత్రణ, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ వినియోగం మానుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ




**కరీంనగర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యానగర్ 48వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకల నరసయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకుడు మునిగంటి అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యులు అంజన కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజన కుమార్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి నాయకులు సమన్వయంతో పని చేయాలని, అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్రా రాజశేఖర్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజ్ ఉద్దీన్, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్జీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా ఎస్జీటీయూ శాఖ ఆధ్వర్యంలో టేబుల్ క్యాలెండర్ మరియు వాల్ క్యాలెండర్‌ను కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడప శేఖర్, అధ్యక్షుడు సంకేనేని మధుసూదన్ రావు, రాష్ట్ర--జిల్లా బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## నగునూరులో శైశిర నవరాత్రోత్సవాలు ప్రారంభం



**కరీంనగర్, రూరల్ జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాఘమాసం సందర్భంగా నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం నుండి శైశిర నవరాత్రోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్ తెలిపారు. ఆదివారం అమావాస్య రోజున ఉదయం ఆరు గంటలకు అమ్మవారికి ఫలపంచామృతాభిషేకం, మహా హారతి, ధ్వజారోహణ కార్యక్రమాలు ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయి. రెండవ రోజు సోమవారం కలశ స్థాపన, విశేష పూజలు నిర్వహించనున్నారు.22న డుండీ చతుర్థి సందర్భంగా లక్ష్మి గణపతి స్వామివారికి అభిషేకం, అలంకరణ, హారతులు జరుగుతాయి. 23న వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి సరస్వతి అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 25న రథసప్తమి సందర్భంగా విశేష పూజలు, 27న చండీహెూమం, మహా పూర్ణాహుతి, హారతులు జరుగుతాయి.భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## సర్పంచుల సన్మాన కార్యక్రమం విజయవంతం చేయాలి - కడారి అయిలన్న



**కరీంనగర్, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కడారి అయిలన్న, సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య, ట్రస్ట్ అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్, ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం సలహాదారు సాయిల్ల మల్లేశం కురుమ పత్రికా మిత్రులతో మాట్లాడుతూ, రేపు ఆదివారం హైదరాబాద్ నాగోల్‌లోని శ్రీ బీరప్ప స్వామి యెగ్గే మల్లేశం గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం ఆధ్వర్యంలో జరగనున్న కురుమ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు అందరూ తమ సమయాన్ని కేటాయించి తప్పకుండా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా బాల సదన్‌లో దత్తత కార్యక్రమం



**కరీంనగర్, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ బాల సదనం నుండి ఇద్దరు బాలికలను (9, 12 సంవత్సరాలు) హైదరాబాద్‌కు చెందిన దంపతులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా శనివారం దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని సూచించారు. అనాథ శిశువులు లేదా బంధువుల నుండి దత్తత కోరుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డి.సి.పి.ఓ దుర్దాన పర్వీన్, సి.డబ్ల్యు.సి చైర్‌పర్సన్ దనలక్ష్మి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, రాజ్ కుమార్, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేత్రదాత కాచం రాజమ్మ సంస్మరణ సభ



**కరీంనగర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ గణేష్ నగర్‌కు చెందిన కాచం రాజమ్మ (82) మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ఈ సందర్భంగా వారి స్వగృహంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి, రాజు, జిల్లా బాధ్యులు రాజ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు నరహరి నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. ఎడవల్లి విజయేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. మానవత్వానికి పెద్దపీట వేసిన రాజమ్మ కుటుంబ సభ్యులు రాజశేఖర్, లక్ష్మణ్ కుమార్, శ్రీహరి, చంద్రశేఖర్, తిరుమల--వీర రమణయ్య, వీరలక్ష్మి--శ్రీనివాస్‌లను ఆర్‌ఎస్ఎస్ బాధ్యులు బోర్ల దక్షిణామూర్తి, మల్లోజుల కిషన్, కల్లె పరుశురాం, పుల్లూరి రామారావు, కొండ రాజశేఖర్, చామ మహేశ్వర్, విఠలాచారి తదితరులు అభినందించారు. సమాజహితం కోసం నేత్రదానం చేసిన కుటుంబాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, జిల్లా సలహాదారు తాడూరి కరుణాకర్, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, కే.ఎస్. వాసు, వెల్ది కవిత, రాజ కనకయ్య, నరహరి తదితరులు అభినందించారు.

# బీజేపీ,బీఆర్ఎస్ అవినీతి కవలలుగా ప్రజల కష్టాన్ని దోచుకున్నాయి

### - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్ ,జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ నేతలతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ--బీఆర్ఎస్ అవినీతి కవలలుగా ప్రజల కష్టాన్ని దోచుకున్నాయని, వారి పాలనలో నగరంలో పర్సంటేజీ కల్చర్ పెరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలకవర్గంలో అవినీతికి పాల్పడిన నేతలు మరో అవతారంలో బీజేపీలోకి వెళ్తున్నారని, పార్టీలు మారినా అవినీతి రూపం మాత్రమే మారుతుందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం పైగా స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత కరెంటు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ విశ్వసనీయతను చాటుతున్నాయని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని బీజేపీ--బీఆర్ఎస్ కలసి ధ్వంసం చేశారని, స్మార్ట్ సిటీ పనులు, కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. నగర అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వెలిచాల రాజేందర్ రావు, వైద్యుల అంజన్ కుమార్, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మేనేని రాజనర్సింగారావు, ముద్దం తిరుపతి, ముద్దసాని రంగన్న, బానోతు శ్రవణ్ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, రామిడి రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, లింగంపల్లి బాబు, సిరికొండ శివప్రసాద్, నెల్లి నరేష్, కంకణాల అనిల్ కుమార్, ఇరుమళ్ళ మల్లేశం, ఇమ్రాన్, పెంట శేఖర్, పర్వత మల్లేశం, అందశంకర్, దీకొండ శేఖర్, బత్తుల రాజకుమార్, మంద మహేష్, సత్తినేని శ్రీకాంత్, దుబాసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల కోసం కులసంఘాలను మోసం చేస్తున్న మంథని ఎమ్మెల్యే

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**/మంథని, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎన్నికలు వస్తేనే అభివృద్ధి పనులు గుర్తుకు వచ్చే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈ ఎలక్షన్ల ఓట్ల కోసం కుల సంఘాలను మోసం చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం రోజున మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ మాసంలో కుల సంఘాలకు భవనాలు మంజూరు చేశానంటూ పాలాభిషేకాలు చేయించుకున్న మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ ఆ భవనాలకు జనవరి 12న శంఖుస్థాపనలు చేశారని అన్నారు. అయితే మంథని పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద మేర,పూసల, స్వర్ణకార,కుమ్మరి,నాయిబ్రాహ్మణ కుల సంఘాలకు ఒకే చోట భవన నిర్మాణాల కోసం శిలాఫలకాలు వేసి శంఖుస్థాపన చేశారని అయితే ఆ ప్రాంతమంతా వాగు ఒడ్డున ఉందని ముంపుకు గురయ్యే ప్రాంతంలో కులసంఘ భవనాలు నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. బఫర్ జోన్,నాలా నద్దీ ప్రాంతాల్లో నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో ఇక్కడ భవనాలు నిర్మిస్తామనడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా టెండర్లు పూర్తయి సైట్ ఆధీనంలోకి వచ్చి కాంట్రాక్ట్ చేతికి సైట్ అందిన తర్వాతనే శిలాఫలకాలు వేసి శంఖుస్థాపనలు చేస్తుంటారని ఒక్కోసారి కాంట్రాక్ట్ వచ్చి సైట్ ఆదీనంలోకి రాకపోసే క్యాన్సల్ అయ్యే ప్రమాదం కూడా ఉంటుందని ఆయన వివరించారు. కానీ ఇక్కడ ఏమీ లేకుండానే కేవలం టెండర్లు పిలిచి శంఖుస్థాపనలు చేసి కుల సంఘాలను మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మోసం చేశాడని అన్నారు. అంటే వాగు ఒడ్డున ఉన్న కుల సంఘ భవనాలన్నీ వాగులో కొట్టుకుపోవాలన్నదే ఆయన ఆలోచననా అని ప్రశ్నించారు. ఓట్లు వస్తేనే ఇవన్నీ మంథని ఎమ్మెల్యేకు గుర్తుకు వస్తాయని రెండేళ్ల కాలంలో కులసంఘ భవనాలు ఎందుకు గుర్తుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. కాపు కుల సంఘానికి కూచిరాజ్‌పల్లి వద్ద కేటాయింపు చేశారని ఆయన వివరించారు. కులాలు లేవని అంటూనే వివక్ష చూపిస్తున్నాడని ఆయన అన్నారు. సమాజం మేల్కొనే వరకు ప్రజలను అప్రమత్తం చేయడంలో అలసత్వం వహించకుండా నా పాత్రను పోషిస్తానని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాలో పైసాలేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓవైపు మొత్తుకుంటుంటే నగర అభివృద్ధి సంస్థ పేరిట నిధులు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే బిల్లులు రాక ఎంతో మంది కాంట్రాక్టర్‌లు పనులు మధ్యలోనే ఆపేస్తున్నారని ఆయన వివరించారు..

## నర్సింగపూర్ గ్రామపంచాయతీ ని తనిఖీ చేసిన ఎంపీఓ



**అక్షర వేదం, జైపూర్, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని నర్సింగపూర్ గ్రామపంచాయతీ ని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు ఇన్స్పెక్షన్ లో భాగంగా సందర్శించడం జరిగింది, ఈ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి క్రమం తప్పకుండా 9 గంటల లోపల గ్రామపంచాయతీలకు హాజరుకావాలని, గ్రామపంచాయతీలో పారిశుద్ధ పనులు మెరుగుపరచాలని ఇంటి పన్నులు ఈనెల 31లోపు 100% వసూలు పూర్తి చేయాలని, రికార్డులు అప్డేట్ చేయాలని, రానున్నది ఎండాకాలం కావున త్రాగునీటి సమస్యలు రాకుండా సిద్ధంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి ని ఆదేశించారు, అదేవిధంగా గ్రామం లో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ తుంగపిండి తిరుపతి, ఉపసర్పంచ్ వేముల విమల మోహన్ గౌడ్, హౌసింగ్ ఏఈ కాంక్ష , పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది స్థానికులు పాల్గొనడం జరిగింది.

## గ్రూప్ 3లో ఉద్యోగం సాధించిన గంగాపురి యువకుడు



**మంథని, జనవరి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మంథని మున్సిపాలిటీలోని గంగాపురి గ్రామానికి చెందిన అట్టి శ్యాం కుమార్ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 3 పరీక్షల్లో 800వ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్యాం కుమార్ కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకోవడం పలువురికి ఆదర్శంగా మారింది. గ్రామీణ ప్రాంతంలో విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే లక్ష్యాన్ని వదలకుండా నిరంతరం శ్రమించారు. ఈ పరీక్షలో విజయం సాధించానని ఆయన తెలిపారు. తన విజయానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల దీవెనలు,కుటుంబ సభ్యుల సహకారం,గ్రామ ప్రజల ఆశీస్సులేనని శ్యాం కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా చదువుపై తనకు ఉన్న నమ్మకం,పట్టుదల తనను ఈ విజయానికి కారణమని ఆయన అన్నారు. ఈ విజయం సాధించిన అనంతరం పెద్దపల్లి ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా నియామకం పొందిన శ్యాం కుమార్ సోమవారం నుంచి అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి శ్రమిస్తే తప్పకుండా విజయం సాధించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగాపురి గ్రామ ప్రజలు,మిత్రులు, శ్రేయోభిలాషులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత యువతకు ఆయన విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు..